క్లుప్తంగా

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించండి

కమలాపురం : ఎలాంటి అపరాధు రుసుం లేకుండా ఈ నెల 31లోగా ఆస్తి పన్ను బకాయిలను చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆస్తి పన్ను చెల్లించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి పెనాల్టీ రూపంలో పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే పన్ను చెల్లించుటకు పట్టణంలోని అన్ని సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆస్తులకు సంబంధించిన పన్నులను చెల్లించాలని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యలపై తనిఖీ



తాగునీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సింహాద్రిపురం : కోవరంగుంటపల్లె పంచాయతీలో గురువారం ఎంపీడీవో కృష్ణమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీల్లో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య పనులపై తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం సచివాలయాలను సందర్శించి రెండు రోజుల్లో అన్ని సర్వేలను పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించారు. ఆదరణ పనిముట్ల కొరకు అన్ని చేతి వృత్తులవారు ఏ కులం వారైనా ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాలెపాడులో పోలీసు బందోబస్తు



బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ తిమోతి

ఎర్రగుంట్ల : మండలంలోని మాలెపాడు గ్రామంలో గురువారం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుస్తుగా కలమల్ల ఎస్ఐ తిమోతి అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇటీవల నీటి సరఫరా విషయంలో సమస్య తలెత్తింది. దీంతో ముందస్తుగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇటీవల మట్టి తరలింపు విషయంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి జరిగిన విషయం తెలిసిందే.

ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు

కొండాపురం : ఎస్సీ వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దని మాలమహానాడు నాయకులు మనోహర్‌బాబు, చిన్న, జోషఫ్‌లు తెలిపారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కువ ఉన్న ఎస్సీలను తక్కువ చూపి వర్గీకరణ చేయడం చాలదారుణమన్నా రు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇదేమాదిరిగా ఎస్సీలకు అన్యాయం చేసిందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మీనాకు వారు వినతిపత్రం అందజేశారు. అన్నదమ్ములాంటి మాలమాదిగలను విడగొట్టి ఒకరిని ఎక్కువ ఒకరిని తక్కువ చేయడం చాల అన్యాయం అన్నారు.

తాగునీటి సరఫరా



ఆరవేటిపల్లెకు ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె ప్రజలకు అధికారులు తాగునీటి సరఫరాకు పనులు పూర్తిచేశారు. ఈనెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో ఆరవేటిపల్లెలో నీటి కష్టాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సంబంధిత అధికారులు ప్రజలకు తాగునీరు అందించడానికి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. బొందలకుంట గ్రామం నుంచి ఆరవేటిపసులకు పైప్‌లైన్ నిర్మించి తాగునీటి సౌకర్యం కలుగజేశారు. గ్రామంలో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో గత కొద్ది రోజులనుంచి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. సాక్షి కథనంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తచేస్తున్నారు.

పనిభారం తగ్గించాలి

ముద్దనూరు : సచివాలయ పంచాయతీ కార్యదర్శులకు అదనపు విధులు కేటాయించకుండా పనిభారం తగ్గించాలని సచివాలయ కార్యదర్శులు గురువారం ఎంపీడీవో ముకుందరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మిరప సాగుపై రైతుల ఆసక్తి

- నియోజకవర్గంలో 3 వేల ఎకరాలలో సాగు
- ఎకరాకు లక్షకుపైనే పెట్టుబడి
- వేసవిలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

వేముల : ఈ ఏడాది మిరప సాగుపై రైతులు దృష్టి సారించారు. పులివెందుల నియోజకవర్గంలో 3 వేల ఎకరాలలో మిరప పంటను సాగు చేస్తున్నారు. పంట మార్పిడిలో భాగంగా రైతులు మిరప పంటను సాగు చేస్తున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున మొక్కలను సంరక్షించుకోవడం రైతులకు భారంగా మారుతోంది. మిరప మొక్కలు నాటిన మొదలు ఎండలకు మొక్కలు చనిపోకుండా రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మిరప సాగు పెట్టుబడులతో కూడుకున్నది అయినప్పటికి రైతులు సాగుకు వెనుకాడటంలేదు. ఉద్యాన పంటల్లో పెట్టుబడులతో కూడుకున్న పంట మిరప. సాగులో ఆదాయం ఉంటుందనే ఆ దిశగా సాగు చేస్తున్నారు.

నియోజకవర్గంలో 10 శాతం పెరిగిన సాగు :

ఈ ఏడాది పులివెందుల నియోజకవర్గంలో 10 శాతం మేర మిరప సాగు విస్తీర్ణం పెరిగింది. నియోజకవర్గంలోని పులివెందుల, వేముల, లింగాల, వేంపల్లె మండలాల్లో వ్యవసాయ బోర్లు, బావుల కింద డ్రిప్ ద్వారా మిరప పంటను సాగు చేస్తున్నారు. వేసవిలో ఎక్కువ మంది రైతులు డ్రిప్ ద్వారానే సాగుకు మొగ్గు చూపుతున్నారు. డ్రిప్ ద్వారా మిరప సాగు చేయడంవలన భూమిలో తేమ శాతం బాగా ఉండి మొక్కలు చనిపోకుండా ఉంటాయనే రైతుల ఉద్దేశ్యం.



వేల్పుల వద్ద డ్రిప్‌తో సాగు చేసిన మిరప

బయట ప్రాంతాల నుంచి మొక్కలు తెచ్చి

వేసవిలో మిరప సాగు చేసే ముందు రైతులు మేలైన రకాల మొక్కలను ఎంచుకుంటారు. స్థానికంగా నర్సరీలు ఉన్నప్పటికి బయట ప్రాంతాల్లోని నర్సరీల నుంచే మొక్కలను తెచ్చి సాగు చేస్తున్నారు. మిరప సాగు చేసే రైతులు మైదుకూరు, జీవీ సత్రం, ముద్దనూరు, ముదిగుబ్బ, మాచర్ల తదితర ప్రాంతాల నుంచి మిరప మొక్కలను తెస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా వీఎన్ఆర్ 314, డీసీహెచ్ 514 అనే రకాలను సాగు చేశారు. ఎకరాకు 30 వేల నుంచి 40 వేల మొక్కలను నాటారు. మిరప సాగు ఖర్చుతో కూడుకున్నది కావడమే రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మిరప నాటిన 75 రోజులకు పంటలో దిగుబడులు కోతకు వస్తాయి. తోటలలో మిరప కోతలు ప్రారంభమైనప్పటి నుంచి 4 నుంచి 6 కోతలు వస్తాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు లక్షకుపైనే పెట్టుబడి

మిరప సాగులో ఎకరాకు లక్షకుపైనే పెట్టుబడులు అవుతున్నాయి. మిరప నాటినప్పటి నుంచి వారానికొకసారి మందులను స్ప్రే చేయాల్సి వస్తోంది. పంటలో ఎక్కువగా తామర పురుగు, తెల్లనల్లి, కొమ్మ ఎండ తెగులు సోకుతాయి. వీటి నివారణకు పిప్రోనస్, పెగాసస్, బెనీవియా, డెలిగేట్, మొమెంటో ఎనర్జీ తదితర రకాల మందులను స్ప్రే చేయాల్సి వస్తోంది. పంటలో సస్యరక్షణకు రైతులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. మిరప సాగులో వేసవిలో దిగుబడులు అందితే ధరలు ఉంటాయనే ఆశతోనే రైతులు మిరప సాగు చేశారు.

వేసవిలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

మిరప నాటిన తర్వాత ఎండలతో భూమిలో తేమ తొందరగా ఆరిపోయే అవకాశం ఉన్నందున మూడు నుంచి నాలుగు రోజులకు నీటి తడులు ఇస్తున్నారు. ముఖ్యంగా డ్రిప్ కింద సాగు చేసిన మిరప పంట కొంత మేర నీటి ఎద్దడిని తట్టుకుని మొక్కలు చనిపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో ఎక్కువమంది రైతులు డ్రిప్ కిందనే మిరప సాగు చేశారు. కొంతమంది రైతులు మాత్రమే నీటితడులు అందించేలా సాగు చేసుకున్నారు.



నర్సరీలో పెంచుతున్న మిరప మొక్కలు



నీటి తడులు అందించేలా సాగు చేసిన మిరప

ధరలు ఉంటాయనే ఆశతో

మార్చి నెలలో మిరప సాగు చేస్తే మే నెలలో దిగుబడులు వస్తాయి. ఆ సమయంలో ధరలు కూడా ఉటాయని రైతులు నమ్ముతున్నారు. గత ఏడాది మిరపకు మంచి ధరలు పలికాయి. 50 కిలోల బస్తా రూ.4వేలకు ధరలు ఉండటంతో మిరపలో రైతులకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా ధరలు ఉంటాయని రైతులు నమ్ముతున్నారు.

6 ఎకరాలలో మిరప సాగు చేశా



నాకున్న 6 ఎకరాలలో మిరప సాగు చేశా. ఎకరాకు 40 వేల మొక్కలు నాటా. మిరప నాటేందుకు ఎకరాకు రూ.50 వేలు ఖర్చు అవుతోంది. సాగులో దిగుబడి వచ్చే సమయానికి ఎకరాకు మరో రూ.50 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. మిరప కాయలు కోతకు వచ్చే సమయానికి ధరలు ఉంటాయనే ఆశిస్తున్నాం.

– శివశంకర్‌రెడ్డి, రైతు, మబ్బుచింతలపల్లె

ధరలు ఉంటాయనే సాగు



మిరపలో దిగుబడులు వచ్చే సమయానికి ధరలు ఉంటాయనే సాగు చేశారు. గత ఏడాది మార్కెట్‌లో మిరప ధరలు ఉండటంతో రైతులకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మంచి ధరలు ఉంటాయనే ఉద్దేశ్యంతోనే రైతులు మిరపపై దృష్టి పెట్టారు. సాగులో పెట్టుబడులు అవుతున్న ఒకట్రెండు కోతలకైనా ధరలు వస్తాయనే ఆశతో రైతులు ఉన్నారు.

– రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ, పులివెందుల

నేడు ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి (అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు మధ్యాహ్నం 12 గంటల సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపించాలని వినతి

పులివెందుల రూరల్ : నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని ఇంటి వద్దకే అందించాలని ఆర్డీఓ చిన్నయ్యకు గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఇంటి వద్దకు అందిస్తున్నారని పులివెందుల నియోజకవర్గంలో మాత్రమే అలా చేయడంలేదని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో కూటమి నాయకులు చాలాచోట్ల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించారని, వాటిపైన తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

28న చలో ఢిల్లీ విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న కార్మిక నాయకులు

కమలాపురం : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న జరపతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు పిలుపు నిచ్చారు. గురువారం కమలాపురం పట్టణంలో భవన నిర్మాణ కార్మికులతో కలసి చలో ఢిల్లీ పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. మిగిలిన రాష్ట్రాల్లో ఉండే విధంగానే ఏపీలో కూడా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను తక్షణం విడుదల చేయాలన్నారు. భవన, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం–1996ను తెచ్చిందన్నారు. గత ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ బోర్డు నిధులను మళ్లించి గాలికొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎర్రగుంట్ల : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శేషఫణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తప్పని సరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎంపీడీఓను కలసిని కార్యవర్గ సభ్యులు

ఎర్రగుంట్ల : మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గంను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఈవోపీఆర్డీ రహంతులయ్యల నేతృత్వంలో జరిగింది. అధ్యక్షుడిగా బ్రహ్మయ్య, ఉపాధ్యక్షుడిగా చందన్, జనరల్ సెక్రటరీగా కేవీ భానుప్రశాంత్, గౌరవ అధ్యక్షుడిగా శివశంకర్, మహిళ అధ్యక్షరాలిగా ఎల్.మహేశ్వరీ, కోశాధికారిగా నరేష్, అనదపు సెక్రటరీగా నరేంద్ర, గౌరవ సలహదారుడిగా కృష్ణ తదితరులను ఎన్నుకున్నారు.

గడువు పెంపు

జమ్మలమడుగు : మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి 9వ తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశ దరఖాస్తులను ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు కన్వీనర్, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి అడ్మిషన్లతోపాటు బ్యాక్‌లాక్ అడ్మిషన్లు ఇంగ్లీషు మీడియం ప్రవేశాల కోసం బాలుర, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి



పాడె మోస్తున్న ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, విజయ్ తదితరులు

కమలాపురం : అనాథ మహిళ మృతదేహానికి అంత్య క్రియలు నిర్వహించి కమలాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. స్థానిక పైడిమాను కాలనీకి చెందిన అనాథ మహిళ మల్లీశ్వరీ గురువారం మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌బాబు సహకారంతో మృతురాలి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఇలా అనాథ మహిళకు అంత్యక్రియలు నిర్వహించడం పుణ్యకార్యంగా భావిస్తున్నానన్నారు. ప్రజలు ఇలాంటి కార్యక్రమాలను స్వచ్ఛందంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి అభి ట్రస్ట్ చైర్మన్, కమిటీ సభ్యులు సహకరించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాము ముదిరాజ్, జేసీబీ సుధాకర్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఎస్ఐ రూటే.. సపరేటు

- నిత్యం మామూళ్లతో జోగుతున్న ఎస్ఐ
- పట్టించుకోని ఉన్నతాధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలోని ఓ మండల ఎస్ఐ రూటే సపరేటు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు. ఆ ఎస్ఐ ప్రవర్తనపట్ల ప్రజలు అస్యహించుకుంటున్నారు. మండలంలో యథేచ్ఛగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. మండల తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి హస్తమున్నట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి. మండలంలో పేకాట, మట్కా, ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నాయి. కానీ మండలానికి సంబంధించిన ఎస్ఐ వాటిని అరికట్టాల్సింది పోయి.. వారితో చేతులు కలిపి రోజువారీగా మామూలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మండలంలోని ఓ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు స్వయంగా తన ఇంటిలోనే నిత్యం జూదం జరిపిస్తున్నాడు. అలాగే డ్యాం పక్కన యథేచ్ఛగా మంగతై జూదం టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. దీనికి మండల తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జి అండదండలు పూర్తిగా ఉన్నాయని పులివెందులలోని జూదరులు చెప్పుకుంటున్నారు. అక్కడికి వెళితే పోలీస్ రైడింగ్, ఇతర సమస్యలు ఉండవని బహిరంగంగా చెప్పుకుంటూ అక్కడ జూదానికి వెళ్తున్నారు. దీని వెనుక పులివెందులలోని మారుతీ హాలు సమీపంలోని ఇద్దరు అన్నదమ్ముల ఆధ్వర్యంలో ఈ జూదం జరుగుతున్నట్లు ప్రజలు, జూదరులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అలాగే మండలంలోని ప్రతి గ్రామంలో బెల్టు షాపులు వెలిశాయి. వీటిపై చర్యలు చేపట్టాల్సిన ఎస్ఐ కానీ, ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. మినరల్ వాటర్ ప్లాంట్ల కంటే బెల్టు షాపులు అధికంగా ఉన్నాయి.

అలాగే చిత్రావతి డ్యాం నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. పార్నపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రతిరోజు చిత్రావతి డ్యాం నుంచి ఇసుకను టిప్పర్ల ద్వారా కర్ణాటకలోని బెంగళూరుకు తరలిస్తున్నాడు. గత ప్రభుత్వంలో ఇసుక రవాణా అడ్డుకునేందుకు పార్నపల్లె – అనంతపురం బార్డర్ మధ్యలో పోలీసుల చెక్ పోస్టు ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ చెక్ పోస్టును పోలీసులు ఎత్తివేశారు. మండలంలో జరుగుతున్న ప్రతి అసాంఘిక కార్యకలాపానికి ఎస్ఐ తీసుకునే ప్రతి లంచంలోనూ తన పరిధిలోని సీఐ, డీఎస్పీలకు వాటాలుగా సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ అసాంఘిక కార్యకలాపాలపట్ల ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా అని ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. కేవలం తనకు ఆదాయం వచ్చే ఫిర్యాదులపట్ల అతను ఉత్సాహం చూపిస్తాడని పోలీస్‌స్టేషన్‌లోని ఉద్యోగులే చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజలకు న్యాయం జరిగేలా అధికారిగా వ్యవహరించాలని మండలంలోని ప్రజలు కోరుకుంటున్నారు.

అంగన్‌వాడీల సేవలు అమూల్యం



మాట్లాడుతున్న సూపర్ వైజర్ పార్వతి

కమలాపురం : చిన్నారులకు అంగన్‌వాడీల సేవలు అమూల్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, జయకుమారి, వెంకటసుబ్బమ్మ అన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం, వెలుగు కార్యాలయంలో కమలాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లకు 'పోషణ్ భీ-పడాయి భీ' అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదర్శీల, నవ చైతన్యం, పోషణ తదితర అంశాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : అంగన్వాడీ కేంద్రాలను పౌష్టికాహార కేంద్రాలుగా మాత్రమే కాకుండా విద్య అందించే కేంద్రాలుగా మార్చడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ స్వర్ణలత తెలిపారు. గురువారం వేంపల్లెలోని ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులపాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పడాయి భీ అనే కార్యక్రమంలో వేంపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం నుంచి మూడు రోజుల పాటు మూలవంకలోని ఉర్దూ పాఠశాలలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అర్హుల పింఛన్లు తొలగించవద్దు

పులివెందుల : 1983 నుండి వికలాంగుల పెన్షన్ పొందుతున్న వారిని రీవెరిఫికేషన్ పేరుతో వేధిస్తే వారి పక్షాన తమ పోరాటం కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగపు నియోజకవర్గ అధ్యక్షుడు చాగలేటి భాస్కర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ను కోరారు. గురువారం వికలాంగుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులు సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వికలాంగుల హక్కుల చట్టం – 2016 మార్గదర్శకాల పుస్తకాన్ని ఆయనకు అందించి మాట్లాడారు. నిజమైన వికలాంగుల పింఛన్‌ను తొలగిస్తే దివ్యాంగుల ప్రయోజనాలకు భంగం కలిగిస్తే చట్టం సెక్షన్ 91, 92 ప్రకారం వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. దీనికి స్పందించిన డాక్టర్ శ్రీనివాస్ గతంలో భోగస్ సర్టిఫికెట్లు తెచ్చుకున్న వారిని మాత్రమే ఏరి వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణమూర్తి, ఆసుపత్రి సిబ్బంది సూర్య నారాయణ, వెంకటసుబ్బయ్య, నాగరాజు, చంద్ర, రామకృష్ణ, సాయి, సుధాకర్, రోశిరెడ్డి, బాబు, వికలాంగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలి



అక్రమ కులాయి కనెక్షన్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలో అక్రమకనెక్షన్లు ఉన్న వారు క్రమబద్ధీకరించుకోవాలని లేకుంటే కనెక్షన్ తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అక్రమ కనెక్షన్లను తొలగించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 400 అక్రమ కనెక్షన్లు క్రమబద్ధీకరించామన్నారు. అక్రమ కనెక్షన్లు కలిగి ఉన్న వారు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.


జాతర ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కమలాపురం : మండలంలోని ఎర్రగుడిపాడు గ్రామంలో ఈనెల 22 నుంచి రెండు రోజుల పాటు జరిగే గంగమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ ఎస్కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎర్రగుడిపాడు గ్రామ మేటీలతో పాటు గ్రామ కమిటీ మెంబర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 22, 23 తేదీల్లో ఎర్రగుడిపాడు గ్రామంలో జరిగే గంగమ్మ జాతరను గ్రామ ప్రజలందరూ కలసి మెలసి నిర్వహించుకోవాలన్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు తావివ్వకుండా గ్రామ పెద్దలు, మేటీలు, కమిటీ సభ్యులందరూ ఒకరికొరకు సహకరించుకుని ఈ జాతరను సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరిగినా అందుకు బాధ్యత మేటీలు, కమిటీ సభ్యులదేనని వారు తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

కమలాపురం : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దచెప్పలిలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చెత్తా చెదారాన్ని వీధుల్లో వేయరాదని, ఇంట్లో ఉన్న చెత్తను డస్ట్‌బిన్‌లలోనే ఉంచాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. 150 మంది కూలీలు టార్గెట్‌గా ఉండగా 100 మంది మాత్రమే పనులకు హాజరయ్యా రని తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి రూ.300 కూలీ డబ్బులు పడే విధంగా కొలతలు ఇవ్వాలన్నారు. ఏపీఓ పార్థసారథి, ఈఓపీఆర్‌డీ కెజియా పాల్గొన్నారు.

పీఈటీని సస్పెండ్ చేయాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్

తొండూరు : విద్యార్థులపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న పీఈటీ సుజాతను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బత్తల అరుణ్ డిమాండ్ చేశారు. గురువారం తొండూరులోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరితారెడ్డిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ బాలికల గురుకుల పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న సుజాత హాస్టల్ విద్యార్థులపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, విద్యార్థులను కూటికి దిక్కులేక వచ్చారని, మీకెందుకు చదువులు ఏదైనా పని చేసుకుని చావండని అవమాన పరుస్తున్నారన్నారు. మీ తల్లిదండ్రులు సాకలేక ఇక్కడ వదిలేశారని, మీరు తిన డానికి తప్ప దేనికి పనికి రారు, వెళ్లి బాత్రూంలు కడిగే పని ఉంటే చేసుకోండని అవమానపరుస్తూ మాట్లాడుతున్నారన్నారు. విద్యార్థులను కించపరుస్తూ పిల్లల ఆత్మ అభిమానం దెబ్బతినే విధంగా ప్రవర్తిస్తూ, పిల్లల దగ్గర బీసీ సంక్షేమ శాఖ మంత్రిని సైతం అవహేళనగా మాట్లాడుతూ విద్యార్థులను కులం పేరుతో, ప్రాంతం పేరుతో దూషించడమేగాక వారిని అనేక చిత్రవదలకు గురి చేస్తున్న పీఈటీ సుజాతను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతామని, స్పందించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

విద్యను మెరుగుపరచాలి



పులివెందులలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

పులివెందుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూలులో నాన్ ఫార్ములా విద్యను మెరుగుపరచాలని సీడీపీఓ శ్రీలత తెలిపారు. గురువారం పట్టణంలోని రమణప్ప సత్రంబడి పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లకు, కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ శ్రీలత హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య సంరక్షణ విద్య, అంగన్‌వాడీ కేంద్రాలలో అనుసరించాల్సిన పద్ధతులపై వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పిల్లల యొక్క అభివృద్ధిలో ఏమైనా లోపాలుంటే వాటిని గుర్తించాలన్నారు. మూడేళ్ల నుండి ఆరేళ్ల వయస్సు గల పిల్లలకు ఆకర్షణమైన ఆటలను అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాలు చేపట్టే విధంగా టీచర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాబున్నీ, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.